ఆక్రమణల చెరలో మేజర్ డ్రెయిన్లు

- ముంపునకు గురవుతున్న పంటపొలాలు
- రానున్న వేసవిలోనైనా పనులు జరిగేనా?

రాజోలు: పంటపొలాలకు సాగునీరు పంపిణీకి కాలువలు ఎంత ఉపయోగపడతాయో అదే విధంగా పంట పొలాల్లోని ముంపునీరు దిగేందుకు డ్రెయినేజీ వ్యవస్థ అంత అవసరం. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో పంటపొలాలు కొద్దిపాటి వర్షానికే పొంగి వెనక్కి తిరిగి ప్రవహించడంతో ముంపునకు గురవుతున్నాయి. దీంతో పంటపొలాలు ముంపునకు గురై రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వరిచేలు ముంపునకు గురై వేలాది ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లుతోంది. రానున్న వేసవిలోనైనా ఈ డ్రెయిన్లకు ఆధునీకరణ పనులు చేట్టాలని రైతులు కోరుతున్నారు. డ్రెయిన్లు గట్టులు పూర్తిగా ఆక్రమణల చెరలో చిక్కుకుపోవడంతో పాటు, పూడిక తీయకపోవడం, గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు పెరిగి డ్రెయిన్లు ముంపునకు గురవుతున్నట్టు అధికారులు గుర్తించారు. రాజోలు నియోజకవర్గంలో వేలాది ఎకరాల పంట పొలాల నుంచి మురుగు, ముంపు నీరు దిగేందుకు సరైన మార్గాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో డ్రెయిన్ల పనులు చేపట్టేందుకు రూ.35.70 లక్షలతో అంచనాలు రూపొందించారు. రాజోలు మండలంలోని చింతలపల్లి, సోంపల్లి, కూనవరం, కడలి డ్రెయిన్ల వెంబడి అధికంగా రొయ్యల చెరువులు సాగు చేయడంతో రొయ్యల చెరువుల్లోని వ్యర్థాలను, మురుగును డ్రెయిన్లలోకి వదిలివేస్తున్నారు. చింతలపల్లి, సోంపల్లి డ్రైన్ పనులను పూర్తి స్థాయిలో నిర్వహించకపోతే వరి సాగు చేసేందుకు వీలు లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. ఈ డ్రెయిన్లలో పెరిగిపోయిన గుర్రపుడెక్క ప్రవాహానికి తీవ్ర ఆటంకంగా మారింది. దీంతో రైతులు పలు మార్లు శ్రమదానం చేసుకుని గుర్రపుడెక్కను తొలగించారు.


గుర్రపుడెక్క పెరిగిపోయిన కడలి డ్రైన్

ముంపునకు గురవుతున్న గ్రామాలు

నియోజకవర్గంలో డ్రెయిన్లు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో చాలా గ్రామాలు వర్షం, మురుగునీరుతో ముంపునకు గురవుతున్నాయి. శంకరగుప్తం డ్రైన్ వెంబడి ఉన్న తూర్పుపాలెం, కేశనపల్లి, పల్లిపాలెం, శంకరగుప్తం, కత్తిమండ, చింతలమోరి, శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం, బట్టేలంక, అడవిపాలెం, పడమటిపాలెం, తూర్పుపాలెం, పల్లిపాలెం, కేశనపల్లి గ్రామాల్లోని కాలనీలు ఏటా ముంపుబారిన పడుతున్నాయి. వీటితో పాటు కేశవదాసుపాలెం నుంచి కరవాక వరకు సుమారు 26 కిలోమీటర్ల పొడవు ఉన్న శంకరగుప్తం మేజర్ డ్రైన్ ఆధునీకరణ చేస్తే నియోజకవర్గంలోని ముంపు సమస్యకు పరిష్కారం కలుగుతుందని తీరప్రాంత వాసులు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగించాలి



డ్రెయిన్ల వెంబడి ఆక్రమణలు పెరిగిపోయాయి. పంటపొలాల్లోని ముంపునీరు దిగేందుకు మార్గాలు మూసుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటపొలాల పక్కనే ఉన్న చెరువుల్లోని వ్యర్థాలను, మలిన నీటిని డ్రెయిన్లలోకి వదలివేస్తున్నారు. డ్రెయిన్లు సరిగా ప్రవహించకపోవడంతో ముంపునీరు పంటపొలాల్లోకి వచ్చేస్తుంది. ఈ కారణంగా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్ల వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించాలి.

– పీతల రామచంద్రరావు, శివకోడు

డ్రోన్లతో ఆక్రమణల గుర్తింపు



రైతులకు ఇబ్బందులు లేకుండా డ్రెయిన్ల మరమ్మతులు చేపట్టేందుకు రూ.35.70 లక్షల ప్రతిపాదనలు పంపించాం. నియోజకవర్గంలో 3,400 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. 10 వేల ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా డ్రెయిన్ల ఆధునీకరణ పనులు చేపడతాం. డ్రోన్లతో డ్రెయిన్ల ఆక్రమణలు గుర్తించి వాటిని ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే రైతులకు ఇబ్బందులు లేకుండా తొలగిస్తాం.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

క్లుప్తంగా

ఆశా వర్కర్‌కు సత్కారం


విమలకుమారిని సత్కరించిన పాలకవర్గం

సఖినేటిపల్లి: కలెక్టర్ కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవ అవార్డు అందుకున్న అంతర్వేదిపాలెంకు చెందిన ఆశా వర్కర్ బి.విమల కుమారిని, సదరు పంచాయతీ వద్ద పాలకవర్గం మంగళవారం సత్కరించారు. సర్పంచ్ నల్లి లీలావతి, విమల కుమారిని శాలువాతో అభినందించారు. మెడికల్ ఆఫీసర్ సీహెచ్ దుర్గాకావ్య, ఎంపీటీసీ మందపాటి రత్నం, నాయకులు నల్లి సురేంద్ర, ఈద రవిరెడ్డి, తోట జాన్‌బాబు, బర్రే ఏడుకొండలు, కాంతారావు, వీరా కర్ణుడు, కపురు శ్రీను, మందపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. మాచవరం శివారు పండువారిపేటలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాస్ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐదేళ్ల చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై వారి తల్లితండ్రులకు సీహెచ్‌ఓ బి.అప్పారావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్ఎం తులసి, ఆశా కార్యకర్త బి.ఎస్తేరురాణి, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరకపాలెంలో పశువైద్య శిబిరం


మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందిస్తున్న సర్పంచ్ ప్రసాద్

రాజోలు: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మెరకపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ గిడుగు వెంకట నారాయణ ప్రసాద్ ప్రారంభించారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ రవికుమార్, వీఏఎస్ సంపత్‌కుమార్, ఏహెచ్ఏ మల్లాడి సాయికుమార్ రాజు, అడబాల సత్యరమేష్, శేఖర్, కోటి తదితరులు పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మంగళవారం 600 లీటర్ల బెల్లపుఊటను కనుగొని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. కొత్తపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నిరంతరం నిర్వహిస్తున్న దాడుల్లో భాగంగా ఎస్సై కె.అన్నవరం ఆధ్వర్యంలో ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక సమీప గోదావరి పరీవాహక లంకలో సారా తయారీకి ఉపయోగించే మూల ద్రవం బెల్లంఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు. వాటిని వెలికితీసి, వాటిలో ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ


శంకరగుప్తం శివారు దిండి మెరక పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరిస్తున్న దాతలు

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం శివారు దిండిమెరక ప్రాథమిక పాఠశాలకు ఇరువురు దాతలు రూ.20 వేలు విలువ చేసే ఇన్వెర్టర్ మంగళవారం బహూకరించారు. ఈ మేరకు స్థానిక దాతలు నేతల సాయిబాబు, యడ్ల వెంకటలక్ష్మిలు రూ.10 వేలు నగదు చొప్పున పై మొత్తంతో సమకూర్చిన ఇన్వెర్టర్‌ను, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌కు అందజేశారు. ఎస్ఎంసీ చైర్‌పర్సన్ నల్లి చిట్టిబాబు, వార్డు మెంబర్ ఉషారాణి, నవయూత్ సభ్యులు పాల్గొన్నారు.

నరసింహారావుకు సన్మానం

అంబాజీపేట: పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో అవార్డు పొందిన తొండవరం హైస్కూల్ ఉపాధ్యాయుడు కందాల గణేష్ నరసింహారావుకు మంగళవారం సన్మానం జరిగింది. జాతీయ స్థాయిలో ప్రదర్శించిన చెత్త నుంచి సంపద పేపర్ పల్ప్ ప్రాజెక్టు ఉత్తమ ప్రదర్శన పొందిన విషయం తెలిసిందే. అవార్డు పొందిన హైస్కూల్ భౌతిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ నరసింహారావును హెచ్ఎం పి.వి కేశవాచార్యులు, స్టాఫ్ సెక్రటరీ మట్టపర్తి రాంబాబు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

దేశ ప్రయోజనాలే లక్ష్యంగా మోదీ పరిపాలన


గొందిలో సంవిధాన్ గౌరవ అభియాన్ సభలో మాట్లాడుతున్న వేమా

సఖినేటిపల్లి: భారతదేశ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రధాని మోదీ పరిపాలన చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మంగళవారం గొంది బీరా వారి పుంతలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన సంవిధాన్ గౌరవ అభియాన్ పేరిట సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేమా మాట్లాడుతూ, బీజేపీ నేతృత్వంలో 22 సార్లు దేశ ప్రయోజనాల కోసం మాత్రమే చట్టసవరణలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం స్వప్రయోజనాల కోసం 106 సార్లు చట్ట సవరణలు చేసి, డాక్టర్ అంబేడ్కర్‌కు ఎంతో గౌరవం ఇచ్చామని మొసలి కన్నీరు కారుస్తోందని ధ్వజమెత్తారు. మరో ముఖ్య అతిథి జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ, 370 ఆర్టికల్, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, బీసీలకు చట్టబద్ధత కోసమే తమ పార్టీ చట్ట సవరణలు జరిపినట్టు అన్నారు. సీనియర్ నాయకులు మాలే శ్రీనివాస నగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, పట్టపు సూర్యప్రకాశరావు, బోణం నాయుడు, రావూరి బాబ్జీ పాల్గొన్నారు.

జొన్నాడలో..

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో మంగళవారం బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి స్వామి ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం జరిగింది. భారత రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా సంవిధాన్ గౌరవ అభియాన్ ఘనంగా జరిగింది. బీజేపీ నేత కొవ్వూరి సీతారామిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బీజేపీ కొత్తపేట నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు, రాజ్యాంగం రచించడంలో అంబేడ్కర్ పోషించిన కీలకపాత్రను కొనియాడారు. తొలుత ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

కిశోరి బాలికల వికాసానికి తోడ్పాటు అందించాలి


ఆలమూరులో కిశోరి బాలికల వికాసంపై ప్రసంగిస్తున్న అధికారులు

ఆలమూరు: కిశోరి బాలికల వ్యక్తిత్వ వికాసానికి స్వయం సహాయక సంఘాలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోర బాలికల వికాసంపై శిక్షణ జరిగింది. కార్యక్రమంలో ఆరోగ్య, గ్రామ సచివాలయం, అంగన్వాడీ, విద్యాశాఖ, మండల మహిళా సమాఖ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో అధ్యక్షత వహించగా సీడీపీవో గజలక్ష్మి, వైద్యాధికారి డి.సువర్చలాదేవి పాల్గొని ప్రసంగించారు. ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్వాడీ కార్యకర్త, ఉపాధ్యాయుడు, మహిళా పోలీసు బందంగా ఏర్పడి గ్రామంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలను, పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించాలన్నారు. రక్తహీనత, మహిళా అక్రమ రవాణా, లింగ వివక్షత, బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలన్నారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం గ్రామాల వారీగా కిశోరి బాలికల వ్యక్తిత్వ వికాస బృందాలను నియమించారు.

ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

కిశోరి బాలికల రక్షణకు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులందరూ సమన్వయంలో పనిచేయాలని ఎంపీడీఓ రాజు కోరారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న కిశోరి బాలికల వికాసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అధ్యాపకురాలు ఎం.స్నేహశ్రీ ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, పీవీ సుబ్బరాజు, ఏపీఎం ఎం.ధనరాజు, సూపర్‌వైజర్ టీఎస్వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, శ్రమ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ బి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: మహిళలు విద్యావంతులైతే సమాజం అభివృద్ధి చెందుతుందని, బాలికలను వారి తల్లిదండ్రులు బాగా చదివించాలని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ కె.విజయప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి విజయశ్రీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో కిశోరీ వికాశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ బాలికల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పౌష్టికాహారం, సైబర్ నేరాలు, అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు సీహెచ్ గంగాభవాని, సర్పంచ్ బి.నాగమణి, ఎంపీటీసీ పి.చినవెంకటలక్ష్మి, ఎంఈఓ కోన హెలీనా, ఐసీపీఎస్ అనూష, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

దేశరక్షణకు విద్యార్థి దశలోనే పునాదులు వేయాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హర్షవర్ధన్

అయినవిల్లి: మన దేశ రక్షణ బాధ్యతను విద్యార్థి దశ నుంచే ప్రణాళికలు ప్రారంభించాలని అప్పుడే దేశ భక్తి అలవడుతోందని ఆర్మీ మేజర్ హర్షవర్ధన్ చావా అన్నారు. ముక్తేశ్వరంలోని కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాల సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వీవీ ప్రసాద్, ప్రిన్సిపాల్ సీహెచ్ బీనాజాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆర్మీ మేజర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. అలాగే మరో అతిథి ఆల్ఫీ జాన్ వర్గీస్ కూడా పాల్గొన్నారు. వారిద్దరు ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతతకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సీవీ సర్వేశ్వరశర్మ, విద్యాశాలల అధినేత నాయుడు, గిడుగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు తీవ్రంగా గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలం ఈతకోట గ్రామానికి చెందిన దూనబోయిన ఆనందబాబు (27) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నెల రోజులు క్రితం చొప్పెళ్ల లంకలో జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకుని ప్రస్తుతం ఇంటి దగ్గర మంచం మీదే ఉంటున్నాడు. సంవత్సరం వరకు కోలుకోలేని పరిస్థితి. ఆయన మీద ఆధారపడి భార్యాపిల్లలు ఉన్నారు. కొన్ని నెలల పాటు వైద్యం చేయించాల్సిన పరిస్థితిలో సాయం కోసం కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను కోరారు. దీంతో ఈతకోటలో ఆనంద బాబు ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు రూ.15 వేల చెక్కు అందజేశారు.


బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

వెంకన్నకు అష్టోత్తర పూజలు

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ప్రాంగణం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అత్యధికంగా తరలివచ్చారు. స్వామివారి అష్టోత్తర పూజలో ప్రతి రోజు కంటే మించి భక్తులు పాల్గొన్నారు. పలువురు భక్తులు స్వామివారికి, వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి విరివిగా విరాళాలు సమర్పించారు. విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన సరిపల్లి లక్ష్మణ శివరామరాజు కుటుంబ సభ్యులు రూ.50 వేలు, ముదునూరి లక్ష్మీపతిరాజు–సుబ్బమ్మ దంపతులు రూ.51,116, భీమవరానికి చెందిన సుబ్బరాజు–జానకమ్మ దంపతులు రూ.25 వేలు, మరికొంత మంది అన్నప్రసాద వితరణకు విరాళాలు ఇచ్చారు.

పర్యావరణానికి విఘాతం కలగకుండా కార్యకలాపాలు

కొత్తపేట: చమురు సహజవాయువుల సంస్థ (ఓఎన్‌జీసీ) జిల్లాలో వెలికి తీస్తున్న చమురు సహజవాయువుల మూలంగా పర్యావరణానికి ఎటువంటి విఘాతం కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కొత్తపేట మండలంలోని మోడేకుర్రులో ఓఎన్జీసీ ఆధ్వర్యంలో నెలకొల్పిన న్యూ జనరేషన్ రిగ్ స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీ అమల్లో భాగంగా ఏర్పాటు చేసిన అధునాతన రిగ్గు పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ రిగ్గు పనితీరు అంతా ఆటోమేటిక్‌గా ఆపరేషన్ అవుతుందని ఎస్టేట్ సపోర్ట్ మేనేజర్ జి శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డోలా కిషోర్, లోకల్ మేనేజర్ ఆర్‌పీ సింగ్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ ఉత్సవాల ఏర్పాట్లపై జేసీ సమీక్ష


అంతర్వేదిలో ఉత్సవాల ఏర్పాట్లు పురోగతిపై సమీక్ష చేస్తున్న జిల్లా జేసీ నిశాంతి

సఖినేటిపల్లి: వచ్చే నెల 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ అంతర్వేదిలో నిర్వహించనున్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం అంతర్వేదిలో కల్యాణ ఉత్సవ ఏర్పాట్ల పురోగతిని జిల్లా జేసీ నిశాంతి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. తీర్థంలో దేవస్థానం పరంగా చేపడుతున్న భక్తుల సౌకర్యాల గురించి అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, జేసీకి వివరించారు. అలాగే ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న పనుల పురోగతిని అధికారులు, జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆయా శాఖల అధికారులకు, జేసీ సూచించారు. తొలుత క్షేత్ర స్థాయిలో ఉత్సవాల ఏర్పాట్లను జేసీ నిశాంతి కాలినడకన వెళ్లి మరీ పరిశీలించారు. కల్యాణ వేదిక వద్ద భారీ షెడ్లలో వీఐపీలు, సాధారణ భక్తులు స్వామి కల్యాణం వీక్షించే విధంగా అధికారులు సిద్ధం చేసిన గ్యాలరీల మ్యాప్‌ను జేసీ పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీ సత్యనారాయణ, జేసీకి వివరించారు. ఆలయానికి ఉత్తరం వైపున స్వామివారి తెప్పోత్సవానికి దేవస్థానం చేస్తున్న ప్రత్యామ్నాయ చెరువు ఏర్పాట్లను జేసీ చూశారు. దేవాలయంలో వీఐపీ, శీఘ్ర, సాధారణ దర్శనాల నిమిత్తం ఏర్పాటు చేస్తున్న మూడు క్యూలైన్ల గురించి అధికారులు, జేసీకి తెలిపారు. వీటితో పాటు తీర్థంలో ఆయా శాఖల ద్వారా భక్తులకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాల గురించి కూడా జేసీ, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అమలాపురం, కొత్తపేట ఆర్డీవోలు కె.మాధవి, శ్రీకర్, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ బాలాజీ, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, వీఆర్వోలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్పీ పర్యటన

అంతర్వేదిలో కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు పర్యటించారు. ఆయన వెంట రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్,టౌన్ ఎస్సై శేఖర్‌బాబు, పి.గన్నవరం ఎస్సై భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

వెన్నెముక ఆరోగ్యంపై డ్రైవర్లు శ్రద్ధ చూపాలి


శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ తేజో ఫణీంద్ర

రావులపాలెం: రహదారి ప్రయాణంలో వెన్నెముకకు గాయమైతే అటువంటి వారు కొన్ని సమయాల్లో మంచానికే పరిమితమై కుటుంబానికి భారంగా మారే ప్రమాదం ఉందని డ్రైవర్లు, వాహనదారులు ఆరోగ్యం పట్ల వెన్నెముకపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రముఖ వెన్నెముక వైద్య నిపుణుడు తేజో ఫణీంద్ర అన్నారు. మండలంలోని ఈతకోట టోల్‌ప్లాజా వద్ద మంగళవారం 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరం వేద ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రాజెక్ట్ మేనేజర్ కె.బాలసుబ్రహ్మణ్యం, టోల్ మేనేజర్ కర్రి వీవీ సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో రాజమహేంద్రవరం వేద హాస్పిటల్ వైద్యుడు తేజో ఫణీంద్ర (ఆర్థోపెడిక్–స్పైన్ స్పెషలిస్ట్), డాక్టర్ లక్ష్మీమృదుల (గైనిక్ స్పెషలిస్ట్) పలువురు వాహనదారులకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో 108 మంది వాహనదారులకు, రోడ్ వినియోగదారులకు, స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అలాగే రూ.2,500 విలువైన ఎముకసాంద్రత పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ డి.సురేంద్రనాథ్, టెక్నికల్ మేనేజర్ అన్సారీ, టీం లీడర్ ఎ.శ్రీనివాసరావు, క్యాషియర్ సురేష్, ఐఎం మేనేజర్ ప్రవీణ్, హెచ్ఆర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'అక్కిరాజు' ట్రస్ట్ సేవలు అభినందనీయం

రాజోలు: ముదునూరి అక్కిరాజు మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం రాజోలు సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలికల వసతి గృహంలో రూ.11 లక్షల సొంత నిధులతో పూర్తి చేసిన ఆధునీకరణ పనులను ఎమ్మెల్యే దేవ ప్రారంభించారు. తండ్రి ముదునూరి అక్కిరాజును స్మరించుకుంటూ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న ముదునూరి లతేంద్రవర్మను అభినందించారు. బాలికల వసతి గృహంలో గదులు, మరుగుదొడ్లు, కారిడర్ పనులును సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే విద్యార్థులు వీక్షించేందుకు ఎల్ఈడీ టీవీని ఏర్పాటు చేశారు. విద్యార్థినులు వసతిగృహంలోని సమస్యలను తనకు తెలియజేయగా అక్కిరాజు ట్రస్ట్ అధ్యక్షుడు లతేంద్ర వర్మ స్పందించి ఆ పనులు పూర్తి చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, డీసీ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, మలికిపురం ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

ఆలమూరు: స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆలమూరు, మండపేట మండలాల్లో మంగళవారం నిర్వహించిన దాడుల్లో ఇద్దరిని అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం ఆలమూరు మండలంలోని జొన్నాడలో సారా విక్రయిస్తున్న పడమట వెంకటస్వామి, మండపేట మండలంలోని వెలగతోడులో రేలంగి సత్యనారాయణను అరెస్ట్ చేసి వారి దగ్గ నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు నుంచి వార్షికోత్సవ పూజలు

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుదీరిన షిర్డీ సాయిబాబా ఆలయ ఆరో వార్షికోత్సవంలో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం నుంచి ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ మంగళవారం తెలిపింది. 2వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు మేళ తాళాలు, భక్తులతో కలిసి వైనతేయ గోదావరి నది వరకు ఊరేగింపు ఏర్పాటు చేశామన్నారు. నదీస్నానం అనంతరం మహా నైవేద్యం, హారతి, దత్తసాయి నామార్చన సత్సంగం రాజోలు వారిచే నక్షత్ర మాలిక, పుష్పాభిషేకం, దూప్ హారతి, దీపాలంకరణ జరుగుతుందన్నారు. 3వ తేదీ సోమవారం వార్షికోత్సవంలో భాగంగా సామూహిక పూజ, పంచామృతాలు, 54 లీటర్ల చెరకు రసంతో అభిషేకం ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా పాలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎంపీటీసీలకు అందని గౌరవ వేతనం

అంబాజీపేట: ఎంపీటీసీలకు గౌరవ వేతనం కూటమి ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందని వైఎస్సార్ సీపీ నేత, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ ప్రశ్నించారు. అంబాజీపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక నెల కూడా గౌరవ వేతనం ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు జీతాలు, రాయితీలు ప్రభుత్వ నుంచి తీసుకుంటున్నారని, మండల స్థాయికి వచ్చేసరికి వివక్ష ప్రదర్శిస్తున్నారని ప్రశాంత్ విమర్శించారు. మండలంలో 18 మంది ఎంపీటీసీలు ఉన్నారని ఏడు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. ఎన్నికల సమయంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు గౌరవ వేతనం పెంచుతామని కూటమి నాయకులు వాగ్దానాలు చేశారే తప్ప అమలుపర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు.

కుష్ఠు వ్యాధి సర్వేకు సహకరించండి

అంబాజీపేట: ప్రతి కుటుంబం ఇంటింటికీ వచ్చే వైద్య సిబ్బందికి సహకరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.అప్పారావు అన్నారు. మాచవరం సచివాలయం–4 పరిధిలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వేను మంగళవారం నిర్వహించారు. సీహెచ్‌ఓ అప్పారావు మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి లెప్రసీకి సంబంధించిన లక్షణాలు స్పర్శ లేకుండా ఉన్న మచ్చలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సర్వేలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. లెప్రసీ లక్షణాలు ఉన్న వారు స్థానిక ఏఎన్ఎం, ఆశాలకు వివరాలు తెలియజేయాలన్నారు. అనంతరం శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సూర్యకుమారి, ఎంపీహెచ్ఏ వి.మురళీకృష్ణ, ఏఎన్ఎం అర్జమ్మ, ఆశా భవాని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభిమానులకు నాయకుల పరామర్శ


పల్లిపాలెంలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెంలో సోమవారం రాత్రి ప్రత్యర్థుల దాడిలో గాయపడి, రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన వైఎస్సార్ సీపీ అభిమానులను మంగళవారం ఆ పార్టీ నాయకులు ఇంటి వద్ద పరామర్శించారు. ఈ మేరకు గాయపడిన కొల్లాటి రాంబాబు, సతీమణి కొల్లాటి సీత, బంధువు కె.పద్మావతిల యోగక్షేమాలను వారు అడిగి తెలుసుకున్నారు. కాగా తమపై జరిగిన దాడి ఘటనపై సఖినేటిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ పోతాబత్తుల భాస్కరరావు, నాయకులు పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్, జిల్లా శ్రీనివాస్, నక్కా రామారావు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పుస్తకాల అందజేత

ఆలమూరు: మండలంలోని చింతలూరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రెపిడిక్స్ ఇంగ్లిషు స్పీకింగ్ కోర్సు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్రీరామ విద్యార్థులకు వాటిని అందించారు. దాత శ్రీరామ మాట్లాడుతూ మాతృభాష మాధ్యమంగా ఆంగ్ల భాషను సులభంగా నేర్చుకోవడానికి ఈ పుస్తకాలు దోహదపడతాయన్నారు. సర్పంచ్ మార్గాని కరుణ, మాజీ జెడ్పీటీసీ దండంగి మమత, మాజీ ఎంపీపీ దండంగి రామారావు, ఎస్ఎంసీ చైర్మన్ బి.దుర్గాదేవి, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు, దేవస్థానం మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


నీటి సంఘాల అధ్యక్షులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: రైతు సమస్యల పరిష్కారానికి నీటి సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద పి.గన్నవరం డీసీ వైస్ చైర్మన్ బొల్లంగి సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని 8 నీటి సంఘాల అధ్యక్షులు కలసి ఎమ్మెల్యేని సత్కరించారు. వారిని కూడా ఎమ్మెల్యే సత్కరించారు.